క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



రాయకుదురులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: భీమవరం రాధాకృష్ణ నేత్రాలయం ఆధ్వర్యంలో వీరవాసరం మండలం రాయకుదురు లింగాకారం సెంటర్‌లో కోదండ రామాలయం వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను కోదండ రామాలయం కమిటీ అభినందించింది. కె.సురేష్, జై కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అదానీని అరెస్ట్ చేయాలని ధర్నా



భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: అవినీతి అక్రమాలకు పాల్పడిన అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం పోలీస్ బొమ్మ సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ పద్ధతుల్లో భారీగా అదాని ఆస్తులు సంపాదించారని విమర్శించారు. పార్లమెంట్ కమిటీ ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, డి.నాగు, అప్పన్న, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ

పాలకోడేరు: వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలు టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని, అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే ఇబ్బందులను అవగాహన చేసుకుని, వ్యతిరేకించాలని వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ కోరారు. శనివారం విస్సాకోడేరులోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ లో మిషన్ శక్తి పథకంలో భాగంగా ఆమె విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పారా మెడికల్ కౌన్సిలర్ జి.దీప్తి మాట్లాడుతూ స్వీయ రక్షణ గురించి రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



కాళ్లకూరులో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలిచిన భక్తులు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామం గోవింద నామస్మరణతో మారుమోగింది. గ్రామంలో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులతో స్వామి వారి దర్శనార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం.అరుణకుమార్ పర్యవేక్షించారు.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నరసాపురం: మండలంలోని వేములదీవి కాపులకొడప గ్రామంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీరాముడు ఆంజనేయస్వామిని ఆలింగనం చేసుకున్నట్టుగా అలంకరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆకివీడు: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆకివీడుకు చెందిన తామడ సుబ్బారావు (90) శనివారం మృతి చెందినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు. సుబ్బారావు ఇంట్లో స్నానం చేస్తుండగా కాలుజారి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం భీమవరం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన బంధువులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వడివడిగా వరి మాసూళ్లు

వాయుగుండం బూచితో వరి మాసూళ్ల ఖర్చుల పెంపు



వీరవాసరం మండలం పంజా వేమవరంలో కోత యంత్రం ద్వారా వరి పంట మాసూళ్లు చేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలో సార్వా వరి పంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మాసూళ్ల ఖర్చు ఘననీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరిసాగు చేయగా ఇప్పటికే తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల పరిధిలో ముమ్మరంగా మాసూళ్లు జరుగుతుండగా మిగిలిన నియోజకవర్గాల్లో ఇప్పుడిప్పుడే మాసూళ్లు ఊపందుకున్నాయి. సార్వా సీజన్ ప్రారంభంలో అధికవర్షాలు, వరదలు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటను పండించారు. ముందుగా వేసిన నాట్లు వర్షాలు, వరదలతో నీట మునిగి దెబ్బతినడంతో రెండు, మూడు పర్యాయాలు నాట్లు వేయాల్సివచ్చింది. దీనితో వరినారు కొనుగోళ్లు, కూలీలకు మరింత చెల్లించాల్సి రావడంతో సాగు ఖర్చులు భారీగా పెరిగాయి.

వరికోత యంత్రాలకు అధిక డిమాండ్

గతంలో వరిపంటను మాసూళ్లు చేయడానికి ఎక్కువగా కూలీలను ఉపయోగించే రైతులు ప్రస్తుతం ఎక్కువగా వరికోత యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. వరిచేలలో పనిచేసేవారి సంఖ్య ఘననీయంగా తగ్గడంతో వరిసాగులో యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే గతంలో పంట మాసూళ్లకు గంటకు రూ. 2 వేలు నుంచి 2,300 వరకు వసూలు చేయగా ప్రస్తుతం బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు త్వరితగతిన పంటను గట్టెక్కించడానికి కంగారుపడుతున్నారు. రైతులంతా ఒక్కసారిగా కోత యంత్రాల కోసం పరుగులు తీయడంతో గంటకు రూ.3 వేలుకు పైగా వసూలు చేస్తున్నారు.

70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 6.10 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఇప్పటి వరకు దాదాపు 9,613 మంది రైతుల నుంచి సుమారు 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనికిగాను రైతులకు రూ. 153 కోట్లు చెల్లించాల్సి ఉండగా దాదాపు రూ. 144 కోట్లు చెల్లించారు.

వరి కోత యంత్రాలకు డిమాండ్



వాయుగుండంతో పంటకు నష్టం వస్తుందని తొందరగా మాసూళ్లు చేయాలని చూస్తుంటే కోతయంత్రాలకు అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది సార్వా సీజన్‌లో గంటకు రూ. 2,300 తీసుకుంటే ఇప్పుడు రూ. 3 వేలు తీసుకుంటున్నారు. తప్పని సరి పరిస్థితిలో కోత యంత్రాలనే ఆశ్రయించాల్సి వస్తుంది.

– కాపకాయల సత్యనారాయణ, రైతు, పంజావేమవరం

కూలీల కొరతతో ఇబ్బందులు



రైతులంతా ఒకేసారి మాసూళ్లుచేపట్టడంతో కూలీల కొరత ఏర్పడింది. వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న ధాన్యాన్ని ఎండబెట్టడానికి తప్పనిసరిగా కూలీలను ఉపయోగించాల్సి వస్తుంది. అయితే వ్యవసాయ పనులు చేసే కూలీలు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పోలిశెట్టి కృష్ణ, వీరవాసరం

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఎస్సై వీర్రాజు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం యనమదుర్రు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 2550 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీర్రాజు తెలిపారు.

నేడు చదరంగం పోటీలు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపికలో భాగంగా పాలకొల్లు పట్టణంలో చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్ తెలిపారు. శనివారం కిషోర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న యూరో కిడ్స్ స్కూల్‌లో జిల్లా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు చెస్ బోర్డులు వారే తెచ్చుకోవాలని సూచించారు. అలాగే పోటీలో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు రూ. 300 చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం 90632 24466కు ఫోన్ చేయాలని సూచించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కాళ్ల: ముఖ్యమంత్రి సహాయనిధి రోగుల పాలిట పెన్నిధని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. పెదఅమిరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ×ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 14,85,066/– సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందించారు.

కార్మిక సభలను విజయవంతం చేయాలి

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబర్ 26న భీమవరంలో జరిగే సభను జయప్రదం చేయ్యాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శనివారం పంచాయితీ కార్మికులు స్కీం వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పంచాయితీ కార్మికులు, స్కీం వర్కర్లు, ఆశ అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం కార్మికులు ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ కనీస వేతనాలకి నోచుకోవటం లేదన్నారు. కార్యక్రమంలో సానబోయిన కృష్ణారావు, సత్యనారాయణ, కడిమి పొల్రాజ్, చిలకపాటి పోలు తదితరలు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రిస్మస్ ఉదయ ఆరాధనలు

ఉండి: మండలంలోని వెలివర్రు సెయింట్ జాకబ్ లూథరన్ చర్చిలో సోమవారం నుంచి డిసెంబర్ 24 వరకూ నెలరోజుల పాటు ఉదయ ఆరాధన ప్రార్థనా కూడికలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంఘ సీఆర్ బ్రదర్ పొట్ల పరదేశికుమార్ ఆరాధన వాక్యసందేశం అందిస్తారని పేర్కొన్నారు.

4న యూపీఎఫ్ క్రిస్మస్

ఉండి: మండలంలోని చెరుకువాడ క్రీస్తు సంఘం చర్చిలో బ్రదర్ పురుషోత్తం సమక్షంలో డిసెంబర్ 4న యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ (యూపీఎఫ్) క్రిస్మస్ వేడుక నిర్వహిస్తున్నామని మండల అధ్యక్ష, కార్యదర్శులు రెవరెండ్ ఎస్.పీటర్, రెవరెండ్ ఎం.యోనాతాను తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ వేడుకకు బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు బ్రదర్ మేడిద జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూపీఫ్ సభ్యులు, నాయకులు తప్పక పాల్గొనాలని కోరారు.

రెండు పూటలా రక్షిత మంచినీరు



ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామాల్లో రక్షిత మంచి నీటిని రెండు పూటలా అందించాలని, కూళాయిలకు మోటర్లు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించి చివరి ప్రాంతాలకు నీళ్ల సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో గ్రామ నీరు సరఫరా, పారిశుద్ధ్య, జలజీవన్‌మిషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె అంగన్‌వాడి సెంటర్లు టాయిలెట్స్, అంగన్‌వాడి సెంటర్లలో మంచినీటి సదుపాయం, ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణాలు, మరమ్మత్తులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మండలాలు వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ఓహెచ్ఎస్ఆర్‌లు 998 పనులకు గానూ 554 పూర్తికావడంపై జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో అంగన్‌వాడి సెంటర్లకు సంబంధించి 150 మరుగుదొడ్లకు గాను 20 మాత్రమే పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీవీ నాగేశ్వరరావు,జిల్లా ఐసీడీఎస్ నోడల్ అధికారి పి.వి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్ ఆవిష్కరణ

సాయుధ దళాల పతాక ఆవిష్కరణ దినోత్సవం డిసెంబర్7న నిర్వహించినున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ నాగరాణి శనివారం ఈ ఏడాది ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టిక్కర్లను, ఫ్లాగ్స్‌ను విద్యార్థులకు, వివిధ వర్గాలకు సాయుధ దళాల పతాక విరాళాల సేకరణకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి కేవీఎస్ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో డ్వామా, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లాలో 368 సీసీ, బీటీ, డబ్ల్యూబీఎంలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా 318 గ్రౌండ్ కాగా, 50 పనులను వెంటనే చేపట్టి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. మండలాల వారీగా రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన టార్గెట్‌ను డిసెంబరు 31 నాటికి పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి కేఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు ఇస్రోలో చేరాలి



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఇస్రో శాస్త్రవేత్త మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజనీరింగ్ విద్యార్థులు ఇస్రోలో చేరి దేశానికి సేవలందించాలని ఇస్రో శాస్త్రవేత్త హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ గ్రూప్‌నకు చెందిన రేమల్ల మూర్తి విద్యార్థులకు పిలుపునిచ్చారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇంజనీరింగ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్యభట్ట నుంచి చంద్రయాన్ గగనయాన్ వరకు ఇస్రో సాధించిన విజయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులపై దేశ ప్రగతి బాధ్యత ఎంతో ఉందన్నారు. భవిష్యత్తులో రవాణా, నీటి వనరుల నిర్వహణ, విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం టెలిమెడిషన్ వంటి రంగాల్లో శాస్త్ర పరిశోధనలు మరిన్ని రావాలని మూర్తి చెప్పారు. ఇంజనీరింగ్ ఫిజిక్స్ హెడ్ ఎంవీ సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు రేకెత్తించేందుకు ప్రత్యేకంగా ఇస్రో శాస్త్రవేత్తతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ఇస్రోశాస్త్రవేత్త మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ రమణమూర్తి, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, నానో టెక్నాలజీ హెడ్ వేణురెడ్డి, దివాకర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని నేటి ఓటమి రేపటి విజయానికి నాందిగా మలుచుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడామైదానంలో 16వ ఈషా గ్రామోత్సవం రూరల్ ప్రీమియం లీగ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తాయని విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని యువత గుర్తించాలన్నారు. క్రీడా స్ఫూర్తి క్రీడాకారులకు చాలా అవసరమని, ఇటువంటి క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ ప్రతిభ కనబర్చి పథకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ ఇలాంటి క్రీడల పోటీలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈషా ఫౌండేషన్ డి.విజయ, ఉపేంద్ర వర్మ, కేపీ వర్మ మాట్లాడుతూ మొదటి లెవల్ (క్లస్టర్) మ్యాచ్‌లు రెండు రోజులపాటు పురుషులు వాలీబాల్, స్త్రీలు త్రో బాల్ పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో గెలుపొందిన క్రీడాకారులు రెండో లెవల్ లోకి అర్హత సాధిస్తారని అక్కడ విజయం సాధిస్తే డిసెంబరు 28న కోయంబత్తూరులో జరిగే ఫైనల్స్ పాల్గొంటారని వివరించారు. ఫైనల్స్ విజేతలకు రూ. 5 లక్షల బహుమతి అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, కళాశాల పాలకవర్గ సభ్యుడు కునపరాజు రామకృష్ణంరాజు, బీవీ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది



ఉండి సభలో కామ్రేడ్స్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకిచ్చిన మాటలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసి ప్రజల్ని మోసం చేసిందని సీపీయం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఉండిలో నిర్వహించిన సీపీయం 9వ మండల మహాసభలో ప్రభుత్వంపై మండిపడ్డారు. ఉండి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో శనివారం వీరవల్లి మాధవరావు, నిమ్మతి కిశోర్,రామకూరి వెంకటరత్నంల ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఇటీవల మరణించిన కామ్రేడ్ ప్రకాష్ కారత్,కామ్రేడ్ ఆర్ఎస్,కామ్రేడ్ వలవల శ్రీరామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ధరల నియంత్రణ చేస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. అలాగే సీపీఎం మండల నూతన కార్యదర్శిగా చీర్ల శేషగిరిరావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మునుకోలు వైకుంఠరావు, కిలారి తవిటినాయుడు, మాదాసి గోపి తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించారని మహిళ ఫిర్యాదు

భీమవరం: ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఇద్దరు వ్యక్తులకు బంగారం, నగదు ఇచ్చి తిరిగి అడిగితే చంపుతామని బెదిరించారంటూ భీమవరం పట్టణం నర్సయ్య అగ్రహారం ప్రాంతానికి చెందిన అంతర్వేది అంజలీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు భీమవరం వన్ టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ శనివారం చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో అంజలీదేవి వద్ద మండలి దుర్గాప్రసాద్, మండలి శివసత్య ఆర్థిక ఇబ్బందులంటూ నాలుగు కాసుల బంగారపు గొలుసు, రూ. 5 లక్షల నగదు తీసుకున్నారు. నెలరోజుల్లో తిరిగి ఇస్తామని చెప్పి ఏడాది గడిచి పోయినా ఇవ్వకపోవడంతో సొత్తు గురించి అడుగుతున్న అంజలీదేవి ఆమె కుమార్తెను దూషిస్తూ చేతులతో కొట్టి తమను అల్లరి చేస్తే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: నేటి యువత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలని పట్టణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల విద్య అంటే ఆకర్షణీయమైన టీనేజీ వయస్సని అన్నారు. విద్యార్థి దశలో ప్రతి విద్యార్థీ ఏకాగ్రతతో మెలగాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా కెరీర్ గైడ్ వైపు మాత్రమే దృష్టి కేంద్రీకరించాలన్నారు. మనిషి జీవితం నాశనం చేసుకోవడానికి ఒక్క నిమిషం సరిపోతుందని అదే బాగుచేసుకోవాలంటే చాలా కష్టపడాలని అన్నారు. ఏదైనా తప్పు చేసేటప్పుడు ఒక్కసారి మన కోసం మన తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. మంచి కన్నా చెడు అత్యంత వేగంగా ఆకర్షిస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జి.రఘు, ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు, అధ్యాపకులు కె.మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఏఎస్ఎస్ రమణ కుమార్, పీఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తరగతులు



ఉచిత ధ్యాన, యోగా శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యంగా సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగా ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ సిద్ధ ఆశ్రమం ఉచిత ధ్యాన యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రేమ్ నిరంతర్ గురూజీ తెలిపారు. శనివారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అల్లూరి సీతారామ సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 25 వ తేది నుంచి 21 రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు పరిచయ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి ప్రారంభిస్తారన్నారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7.15 నిమిషాల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం సెక్రటరీ చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆనందం, ధ్యానము, యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ఆహారపు అలవాట్లు, జీవిత తత్వ జ్ఞానం, ధ్యాన, యోగ శిక్షణ అందరూ నేర్చుకుని ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ఉచిత ధ్యాన యోగ శిక్షణా తరగతులు కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో టి.శ్రీనివాస్, కె.దామోదరరావు, రామకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు, జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో డిసెంబరు 6 నుంచి 9 వరకు పురుషులు, మహిళా జట్టుకు అంతర్‌జిల్లాల ఎమ్మెల్యే కప్ బాస్కెట్‌బాల్స్ పోటీలు జరుగుతాయని మార్టేరు యూత్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ల బాలాజీరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఆదివారం మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు ఎక్కువగా రాజీ చేయడానికి కృషి చేయాలని రాజీ ప్రాముఖ్యతను కక్షిదారులకు తెలియజేస్తే స్వచ్ఛందంగా రాజీకి వస్తారని భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి,మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీసు సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసులు పరిష్కారంలో ఏమైనా ఇబ్బందులుంటే సంబంధిత న్యాయమూర్తి దృష్టికి తీసుకురావచ్చునన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.సురేష్ బాబు, 2వ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.ధనరాజు, భీమవరం, ఆకివీడు, ఉండి, కాళ్ల, వీరవాసరం, పాలకోడేరు పోలీసు అధికారులు భీమవరం, ఆకివీడు ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.